సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,5 జనవరి 2025
8 పేజీలు

## ఆర్అండ్ఆర్‌లో 109 ఇళ్లకు అందని నష్ట పరిహారం



**కుక్కునూర్,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కివ్వాక గ్రామంలో మొత్తం 492 ఇళ్లు పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్నవి 2017 సర్వే ప్రకారం ఆ 492 ఇళ్లకు కూడా ప్యాకేజీ రావాల్సి ఉంది అందులో 109 ఇళ్లకు ఇంటి విలువలు (స్ట్రక్చర్ వేల్యూ) మిస్సింగ్ అయ్యాయని ఆవిషయాన్ని గత ఐదు సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్‌కు అధికారులకు చాలాసార్లు వినతి పత్రాలు ఇచ్చి ఉన్నారు కానీ మాకు డబ్బు రాలేదని 109 మంది నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.381 ఇళ్లకు మాత్రమే ఇంటి విలువలు అమౌంటు పడ్డాయని మాకు కూడా ఇంటి విలువల ప్యాకేజీ త్వరగా ఇప్పించాలని గ్రామస్తులు బట్టు వీరబాబు బట్టు రమేష్ రవీంద్ర కుమార్ దండ బత్తుల లక్ష్మి గూడా శీను మేడిపల్లి ప్రవీణ్ వేడుకుంటున్నారు.

# ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం

- నూజివీడులో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి పార్థసారధి
- జిల్లాలో 19 కళాశాలకు చెందిన 3,734 మంది విద్యార్థులకు ప్రయోజనం





**నూజివీడు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుగా ఈఏడాది 27.39 కోట్లు,వచ్చే విద్యా సంవత్సరంలో రూ.85.84 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనున్నదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి వెల్లడించారు.శనివారంనూజివీడుముదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి పరుస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల ను అంది పుచ్చుకుంటూ మంచి ఫలితాలు సాధించా లని సూచించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు పొంది తద్వారా తమ కుటుంబాలను బాగా చూచుకోవాన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఫలితాల మెరుగుదలకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 475ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యానభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులకు నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకాన్ని అమలుకు నిర్ణయించడం జరిగిందన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లాలో 19 జూనియర్ కళాశాలల్లో 3,734 మంది విద్యార్థులు ఉన్నారని వారిలో నూజివీడు జూనియర్ కళాశాలలో 410మంది విద్యార్థులు

- తరువాయి 2లో..





# విద్యా, వైద్యానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రాష్ట్రంలో 475 కాలేజీల్లో 1.48 లక్షల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక కోకోనట్ మర్చంట్సు ప్రభుత్వ జూనియర్ (బాలికలు) కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు, జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు భోజనాలను వడ్డించి,మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి, విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనంచేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, శనివారం ఇంటర్ మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో ప్రారంభించు కోవడం శుభ పరిణామం అన్నారు. కూటమిప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఇంటర్ విద్యలో సంస్కరణలు ప్రారంభించి విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిందన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయుట రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభ పరిణామం అన్నారు. నిరుపేద కుటుంబాలలో విద్యార్థిని, విద్యార్థులకు చదువుకోడానికి సువర్ణ అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, మాజీ శాసనమండలి

- తరువాయి 2లో..

## నేడు కేసరపల్లిలో హైందవ శంఖారావం సభ

- జిల్లా నుండి 25 వేలమందికి పైగా హాజరవుతారని అంచనా

**విజయవాడ/ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రతి ఒక హిందువు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన గారపాటి సీతారామాంజనేయ చౌదరి. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగసభలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో హిందువులు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వహిందూ పరిషత్ పిలుపుతో కులాలు, పార్టీలక తీతంగా హిందూ ఆలయాల పరిరక్షణధ్యేయంగా నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభకు 500 బస్సులు, 800కారులు, 1200 బైకులలో ఏలూరు జిల్లా నుండి తరలివెళ్లేందుకు అన్నిఏర్పాటు చేశారు. హైందవ శంఖారావం



సభకు విహెచ్‌పి అఖిలభారత ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు అధ్యక్షతన జరుగుతోందని రాష్ట్రకార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్ అన్నారు. ఏలూరు జిల్లా నుండి 25 వేలమందికి పైగా హిందూ బంధువులు ఈ సభలో పాల్గొనే

- తరువాయి 2లో..



## సంక్రాంతికి కోడి పందాల బరులు రెడీ

**యలమంచిలి,మేజర్‌న్యూస్:** సంక్రాంతి సంబరాలకు సన్నద్ధమవుతున్న జూదక్రీడలకు బరులు అనువుగా ఉండేందుకు సిద్ధం చేస్తు న్నారు.ప్రతి సంవత్సరం కోట్లది రూపాయలు చేతులు మారుతూ అనేకమంది అమాయకుల జేబులకు చిల్లు పడుతూనే ఉన్నాయి, పోలీసులు ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు రోజులలో కోడిపందాలు పేకాట జోధాలు నిర్వహిస్తే కఠినచర్యలు ఉక్కు పాదంతో

- తరువాయి 2లో..



## విలువలు కలిగిన పత్రిక సూర్య 'దేశం' నేత నాయుడు

**నరసాపురం,మేజర్‌న్యూస్:** ప్రస్తుత రోజుల్లో కొన్ని రకాల మీడియా సంస్థలు వివిధ రాజకీయ పార్టీలకు అనుబంధంగా వ్యవహరిస్తున్నాయని, 18 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన సూర్య దినపత్రిక పార్టీలకతీతంగా ఆదర్శంగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం పట్టణములోని ఆయన నివాసంలో సూర్య ఎగ్జిక్యూటివ్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయుడు మాట్లాడుతూ కుల మతాల కతీతంగా, అణగారిన

- తరువాయి 2లో..

# విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

**– జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం**



**ఏలూరు, మేజర్ న్యూస్ :** ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని' జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి, చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యే ప్రథమ ప్రాధాన్యతగా చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కె.వెట్రిసెల్వి సూచించారు. శాసన సభ్యులు బడేటి రాధాక్రిష్ణయ్య (చంటి) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. పాఠశాల విద్యార్థులతోపాటు కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందించడం శుభపరిణామమమన్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు తమకు టాయిలెట్స్ సౌకర్యం, క్రీడా సౌకర్యం, పరికరాలు అందించాలని కలెక్టర్ ను కోరగా వెంటనే వాటిని ఏర్పాటుచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందించడంపై విద్యార్థినీ, విద్యార్థులు తమ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, ఆర్టీసీ విజయవాడ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, తహసీల్దార్ శేషగిరిరావు, ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబెర్ ఎస్.ఎం. ఆర్. పెదబాబు,కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

## 6 నుండి మంచానికి,వీల్ చైర్‌లకు పరిమితమైన పింఛన్ దారుల తనిఖీ



భీమవరం,మేజర్ న్యూస్: జిల్లాలో జనవరి 6 నుండి మంచానికి, వీల్ చైర్ కి పరిమితమైన పింఛనుదారుల తనిఖీలను చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 1,510 మంది పెన్షనర్లు రూ.15,వేలు చొప్పున పింఛన్ ను అందుకుంటున్నారని, వీరందరూ మంచానికే పరిమితమై లేదా విల్ చైర్ క్యాటగిరిలో పింఛన్లు పొందడం జరుగుతుందని, ఇటువంటి వారిని వారి ఇంటి వద్దనే షెడ్యూల్ ప్రకారం జనవరి 6 నుండి జనవరి 31 వరకు వెరిఫికేషన్ చెయ్యండి జరుగుతుందని తెలిపారు.

వీరికి ఎంపీడీఓలు, మునిసిపల్ కమీషనర్‌ల కార్యాలయాల నుండి ముందుగా ఇంటిమేషన్ లెటర్స్ ను అందజేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల తనిఖీ నిమిత్తం జిల్లాలో డివిజన్ ఒక్కొక్క టీం చొప్పున 3 టీమ్స్ లను రాష్ట్ర స్థాయి నుండి కేటాయించడం జరిగిందన్నారు. ఈ టీమ్స్ మండల రూట్ మ్యాప్ ప్రకారం వెరిఫికేషన్ చేసి డేటా యాప్ నందు టీమ్ ల వారిగా డేటాను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి టీమ్ లో ఒక జనరల్ డాక్టర్, ఒక ఆర్థోపెడిషన్, డిఎ ఉంటారని తెలిపారు. వారితో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి అనుసరిస్తారని అన్నారు.

## 22-ఎ భూములుపై రీ సర్వే పునఃప్రారంభం





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో 22-ఎ భూములకు సంబంధించి భూముల రీ సర్వే పునఃప్రారంభించడానికి ఏలూరు డివిజన్‌కు సంబంధించి 7గురు తహాశీల్దార్లను బృందాలుగా ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఏలూరు డివిజన్ కు సంబంధించి 22-ఎ భూముల తొలగింపునకు సంబంధించి ఏలూరు డివిజన్ లోని మండలాలకు సంబంధించి రీ సర్వేపునఃప్రారంభానికి శిక్షణా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ 22-ఎ భూముల రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ రీ సర్వేకు కమిటీ బృందాలుగా 7గురు తహాశీల్దార్లను నియమించామని తెలిపారు. ఈ మాసంలో ఏలూరు డివిజన్ లో కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలకు సంబందించిన 22-ఎ భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు మండలాలకు సంబంధించి 7 గురు తహాశీల్దార్లను కమిటీ ప్రధానులుగా ఏర్పాటు చేయడం జరిగిందని వీటిలో కలిదిండి మండలం భాస్కరరావుపేట, గురవయ్యపాలెం, కలిదిండి కు సంబంధించి ఎ.శ్రీనివాస్(ఏలూరు రూరల్), కలిదిండికి బి.రమాదేవి (భీమడోలు), ఎల్.వి.ఎస్.రామకృష్ణ(కలిదిండి)లు, ఉనికిలి, వారవాక, వడలిలకు సంబంధించి వై.పూర్ణచంద్రప్రసాద్(ఉంగుటూరు),ెక.గోపాల్( మండవల్లి), ఎ.కృష్ణజ్యోతి (పెదపాడు), సుభానీ (ముదినేపల్లి)లు రీ సర్వేకు నియమించినట్లు తెలిపారు.

రీ సర్వే 15 రోజుల్లోగా పూర్తిచేసేలాగా కేటాయించిన బృందం కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, తహాశీల్దార్లు, పరిపాలనా విభాగం సూపరిం టెండెంట్లు, విఆర్‌ఓలు,ఆర్ డిటిలు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం

మొదటిపేజి తరువాయి

ఉన్నారన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయి సంస్కరణలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే పేదవిద్యార్థులకునాణ్యమైన విద్యఅందుబాటులోకి రానున్నద న్నారు. అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టును సందర్శించి నిర్వాసితులకు న్యాయంచేస్తామని చెప్పి నేడు ఆ మాటను గౌ.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలబెట్టుకు న్నారన్నారు.ఈమేరకు సంక్రాంతి కానుకగా 10వేల మంది పోలవరం నిర్వాసితులకు పరిహారంగా ఒకేరోజు రూ.815 కోట్లు చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి శ్రీనారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డివిఇవో బి. ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

## విద్యా, వైద్యానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మొదటిపేజి తరువాయి

సభ్యులు అంగర రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ,తహశీల్దారు వై.దుర్గాకిషోర్, పురపాలకసంఘం కమీషనరు బి.విజయసారధి,కళాశాలప్రిన్సిపాల్ బి.అప్పారావు, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, బోణం చినబాబు, కోడి విజయభాస్కర్,పాలవలస తులసీరావు,పీతల శ్రీనివాసు, చినమిల్లి గణపతిరావు, కళాశాల అధ్యాపకులు,నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి కోడి పందాల బరులు రెడీ

మొదటిపేజి తరువాయి

అణిచివేస్తామని చెప్పడం పరిపాటే, నిర్వాహకులు ముందస్తుగా బరులు వేస్తే గతంలో పోలీసులు నియంత్రించేవారు, అయితే కూటమీ ప్రభుత్వంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలుకు వెన్నుదండిగా నిలబడిందని దీనిబట్టి అర్థంఅవుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

## నేడు కేసరపల్లిలో హైందవ శంఖారావం సభ

మొదటిపేజి తరువాయి

అవకాశం ఉందని, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిర్వహిస్తున్న ఈసభకు ప్రతి ఒక హిందువు తరలివచ్చి విజయవంతం చేయాలని గారపాటి సీతారామాంజనేయ చౌదరి కోరారు.శనివారం కేసరిపల్లిలో హైందవ శంఖారావం సభ ఏర్పాట్లను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కైకలూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, విహెచ్‌పి అఖిలభారత ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజులతో కలసి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పరిశీలించారు.

## విలువలు కలిగిన పత్రిక సూర్య 'దేశం' నేత నాయుడు

మొదటిపేజి తరువాయి

వర్గాలకు,పేదలకు రాజ్యాధికారం రావాలనే సంకల్పంతో పత్రికఏర్పాటు చేశారన్నారు. పత్రిక ఏర్పాటు చేసిన సందర్భంగా ఏ లక్ష్యాన్ని అయితే నిర్దేశించుకున్నారో, దాని సాధన కోసం యాజమాన్యం ప్రయత్నిస్తుందనిఅన్నారు.అన్నిరంగాలకు సంబం ధించిన వార్తలను ప్రచురిస్తూ పత్రిక ఆదర్శంగా నిలుస్తుందని నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మాజీ ఎంపీపీ కత్తి మండ ముత్యాలరావు, సంకు భాస్కర నాయుడు, మౌలాలి, కోటిపల్లి బ్రహ్మానందం, రామకృష్ణ, వేపూరి వాసు, ఆరేటి వేణు,తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా : వైసిపి నేత రఘురాం



**పెంటపాడు,మేజర్‌న్యూస్ :** పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలోని శనివారం దేవ వెంకటరమణ తల్లి సీతామాలక్ష్మి ఇటీవల కాలం చేశారు. వారి కుమారుడిని వెంకటరమణ ను పరామర్శించిన వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు దారపురెడ్డి శ్రీనివాసరావు, చల్ల కుమారస్వామి, దాట్ల రామలింగ రాజు, దేవరశెట్టి రాంబాబు, మాకరాజు సతీష్ సతీష్, కొండబోయిన కృపావరం,వైఎస్‌ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# పాలకుల నిర్లక్ష్యమే జిల్లా సమగ్రాభివృద్ధికి శాపం

**- సి.పి.ఎం.26వ జిల్లా మహా సభల్లో తీర్మానం**

**భీమవరం,మేజర్‌న్యూస్:** పాలకుల నిర్లక్ష్యమే జిల్లా సమగ్రాభివృద్ధికి శాపం మారిందని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) పశ్చిమగోదావరి జిల్లా మహాసభ పేర్కొంది. భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరుగుతున్న సి.పి.ఎం.జిల్లా 26వ మహాసభ జిల్లా సమగ్రాభివృద్ధికి పలు సూచనలు చేస్తూ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మహాసభలో చేసిన తీర్మాన వివరాలను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం విలేకర్లకు వివరించారు. జిల్లాలో గోదావరి జలాలు, సహజసిద్ధమైన నిక్షేపాలు, పకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అన్ని పంటలూ పండడానికి అనువైన సమ శీతోష్ణస్థితి జిల్లాలో కలిగి ఉండడం మరో ప్రత్యేకత అని ఆయన తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధార పరిశ్రమలను నెలకొల్పి నట్లయితే వేలాది మందికి ఉపాధి కల్పించవచ్చన్నారు.. జిల్లాలో గ్యాస్ వంటి సహజ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ వాటినిఈప్రాంత ప్రజలకు దక్కకపోవడం దురదృష్టకర మన్నారు. ఏ ప్రాంతంలో లభ్యమయ్యే సహజ వనరులు ఆ ప్రాంతానికి అందించడం అంతర్జాతీయ న్యాయ సూత్రమన్నారు. అయితే ఆ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఇక్కడ లభ్యమవుతున్న సహజవాయువు ను వేరే ప్రాంతాలకు తరలిస్తూ జిల్లా ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు..జిల్లా లో లభ్యమవుతున్న సహజవాయువు ను ఇక్కడ వినియోగిస్తే గ్యాస్ సిలిండర్ ను వంద రూపాయలకు అందించవచ్చని తెలిపారు.జిల్లా ప్రజలను విపరీతమైన కాలుష్యం



వేధిస్తోందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసిందని బలరాం పేర్కొన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో రోగాలబారిన పడడానికి ఈకాలుష్యమే ప్రధాన కారణమన్నారు. వృధాగా సముద్రం పాలవుతున్న నీటిని దొంగరావి పాలెం, ఇతరచోట్ల ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేసి నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే విద్యాలయాలు, వైద్య కళాశాల ను ఏర్పాటు చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సి.పి.ఎం.జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జే.ఎన్.వి. గోపాలన్, చింతకాయల బాబూరావు, బురిడీ వాసుదేవరావు పాల్గొన్నారు.

# 17 వరకు ఎస్సీ కుల గణనపై జాబితా ప్రకటన గడువు పొడిగింపు

భీమవరం,మేజర్ న్యూస్: జిల్లాలో ఎస్సీ కుల గణనపై జాబితా ప్రకటనకు ఈ నెల 17 వరకు పొడిగించడం జరిగిందని, ఈ నెల 7 వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని జరుగుతోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు ఎస్సి జనాభా, వారి వివరాలు.. పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాల పై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుచున్నదని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటిలలోని గ్రామ, వార్డు సచివాలయములలో నోటీసు బోర్డు నందు షెడ్యూల్ కులాల వారి జాబితాను డిసెంబర్ 26వ తేదీన ప్రకటించడం జరిగిందన్నారు. తదుపరి మార్పులు, చేర్పులకు అభ్యంతరాలను జనవరి 7వరకు వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.షెడ్యూల్ కులంకు సంబందించిన వారు వారి వివరాలను సచివాలయాలలో పబ్లిష్ చేయబడిన జాబితాను పరిశీలించుకోవాలని తెలిపారు. అర్జీలు ఆధారంగా ఆన్లైన్ చేయుట,మార్పులు, చేర్పులు వివరాలు వెరిఫికేషన్ చేయుటకు 11 వరకు గడువుగా నిర్ణయించడం జరిగిందన్నారు. మార్పులు, చేర్పులు అనంతరం కులం వారిగా జాబితాలను గ్రామ వార్డు



సచివాలయాల్లో జనవరి 17వ తేదీన ప్రకటించడం జరుగుతుందన్నారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు.

# అర్జునుడిపాలెం గ్రామస్తుల అవస్థలు పట్టించుకోరా ?





**ఇరగవరం,మేజర్‌న్యూస్** : మౌలిక సదుపాయాల కల్పనలో నాయకులు మొండి చెయ్యి చూపారంటూ మండలంలోని అర్జునుడిపాలెం గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కనీసం త్రాగు నీటి వసతి, డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయలేని దుస్థితిలో అధికారయంత్రాంగం ఉందని వాపోతున్నారు. ఈ గ్రామానికి ఒక ఘన చరిత్ర ఉంది. జిల్లాలు విస్తరణ జరగకముందు అర్జునుడిపాలెం మూడు నియోజకవర్గలు, నాలుగు మండలాలు, నాలుగు పంచాయతీల పరిధిలో ఉండేది. జిల్లాలు విస్తరణ జరిగాక రెండు నియోజక వర్గాలు, రెండు మండలాల పరిధిలో ఉంది. గ్రామ జనాభా 3223 మంది కలిగి ఉండి 780 నివాసాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వై ఎస్ ఆర్‌సిపి లో సర్పంచ్ విజయం సాధించారు.

ఆ సర్పంచ్ మరణించడంతో మధ్యంత ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో హోరాహోరి పోరులో జనసేన విజయం సాధించింది. ఆ సమయంలో జనసేన పార్టీ అధినేత సైతం ఈ గ్రామాన్ని ప్రత్యేకం అభివృద్ధి చేస్తామని ప్రకటించిన ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోగా కనీసం డ్రైనేజి లు సరిగలేక మురుగునీరు రోడ్లపై పొర్లున్నాయని పలువురు వాపోతున్నారు.కావలిపురం నుండి ఈ గ్రామానికి వచ్చే పైపులైన్ పలు చోట్ల లికేజీలు ఉన్నా ఆడాకారులు గాని పాలకులుగాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదని గ్రామసులు విమర్శస్తున్నారు. గ్రామాల్లో చెత్త రోడ్లు ఇరువైపులా వేసున్నారు. మళ్ళీ వాటిని తగలబెడుతున్నారు. ఇది ప్ర్యావరణం కలుషితమైవుతాదని తెలియదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

**- డ్రైనేజి వ్యవస్థ బాగాలేదానడం వాస్తవమే -**

దినిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామాల్లో 650 వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు, 12 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయని వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతున్నామని చెప్పారు. చెత్తచెదారాలు డంపింగ్ యార్డ్ కి తరలించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు గ్రామాల్లో డ్రైనేజి వ్యవస్థ బాగాలేదానడం వాస్తవమేనని, శాసనసభ్యులు రూ.13లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

సాంకేతిక ప్రణాళికలు రూపొందించి రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

## హైందవ శంఖారావంకు తపన ఫౌండేషన్ నుండి 20 వాటర్ ట్యాంకర్లు



**ఏలూరు,మేజర్ న్యూస్:** కేసరపల్లిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆదివారం నిర్వహిస్తున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ కు వచ్చే లక్షలాదిమంది త్రాగునీటి అవసరాల కోసం టాంకర్లను అందించవలసిందిగా హైందవ శంఖారావ సభ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు స్పందించిన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి తపన ఫౌండేషన్ కి చెందిన జిల్లాలో 20 వాటర్ ట్యాంకర్లను శనివారం కేసరిపల్లికి పంపించారు. హిందూ ఆలయాల పరిరక్షణకు జరుగుతున్న సభలో ప్రతి ఒక్క హిందువు పాల్గొని విజయవంతం చేయాలని గారపాటి చౌదరి కోరారు.

## రమణీయంగా సహస్ర దీపాలంకరణ మహోత్సవం





**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయంలో ప్రతి శనివారం సాయంత్రం పడమర గోపురం వైపు సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగముగా శనివారం సాయంత్రం ఆలయంలో ప్రత్యేక వాహనంపై స్వామివారు ఉభయ దేవేర్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ సహస్ర దీపాలంకరణ మండపం వద్దకు తోడుకొని వచ్చి వేద పండితులు వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలతో సహస్ర దీపాలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ క్రమంలో ఆలయ ఏ ఈ ఓ నటరాజు, డి ఈ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం, హైగ్రీవాచారి,ఆలయ సిబ్బంది, ఆగమ పాఠశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

## జడ్‌పిలో పలువురు ఆఫీస్ సబార్డినేట్‌లకు పదోన్నతులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా పరిషత్ యాజమాన్యంలో పలువురు ఆఫీస్ సబార్డినేట్‌లకు పదోనతుల ఉత్తర్వులను జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి కేడర్లో ను కాళీలు ఏర్పడిన వెనువెంటనే పదోనతులు అర్హత కలిగిన సిబ్బందికి కల్పిస్తున్నాం అని నేటి వరకు ఇలా 46 మందికి వివిధ కెడార్లలో పదోన్నతులు కల్పించడం నాకు సంతోషన్ని ఇచ్చిందని ప్రతి ఉద్యోగి తాను పని చేసే సంస్థ కోసం పాటు పడాలని సంస్థ గౌరవాన్ని పెంచాలని కొరకు. ఈ కార్యక్రమంలో ఉద్యగులు మోహన్ రావు, నటరాజు, రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# లోబ్రిడ్జి సమస్య శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు

**– నిపుణులతో నిశితంగా పరిశీలన : ఎమ్మెల్యే బడేటి చంటి**



**ఏలూరు,మేజర్ న్యూస్:** లోబ్రిడ్జి సమస్య శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. స్థానిక 1టౌన్ – 2టౌన్ ప్రాంతాలను కలుపుతూ అనుసంధానంగా నిర్మించిన రైల్ కమ్ అండర్ బ్రిడ్జిలో నిత్యం గ్రౌండ్ వాటర్ నీరు ఊరుతూ,ఇసుక పైకి రావడంతో బ్రిడ్జి అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతోపాటూ ఈ మార్గంగుండా రాకపోకలు సాగించే పలువురు వాహనదారులు ఇక్కడ నీటి ప్రవాహం వల్ల ఏర్పడిన నాచు కారణంగా జారిపడి ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. దీంతో శనివారం వరంగల్ నిట్‌కు చెందిన నిపుణుల బృందం సభ్యులు ప్రొఫెసర్ రమణరావు, ప్రొఫెసర్ పాండురంగారావు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులతో కలిసి ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి మరోసారి సమగ్ర పరిశీలించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో లోబ్రిడ్జి అతి ప్రాముఖ్యత కలిగిందన్నారు. వాహనాల రాకపోకల రద్దీని తగ్గించేందుకు ఇది అత్యంత ఉపయుక్తమన్నారు. అయితే నిత్యం గ్రౌండ్ వాటర్ ఊరుతూ ఉండడం వల్ల ఆ వాటర్ లోబ్రిడ్జిలో నిలవకుండా మోటర్ల సాయంతో ఎప్పటికప్పుడు పైకి తోడుతు న్నారన్నారు. దీనివల్ల కార్పొరేషన్‌కు నెలకు లక్షరూపాయల వరకు అధిక వ్యయం అవుతోందన్నారు. దీనిదృష్ట్యా సమస్యకు శాశ్వాత పరిష్కారం కల్పించేందుకే నిష్ణాతులైన నిపుణుల్ని తిరిగి ఏలూరు నగరానికి మరోసారి తీసుకు వచ్చామని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపడతానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం నిపుణుల బృందం సభ్యులు ప్రొఫెసర్ రమణరావు, పాండురంగారావులు మాట్లాడుతూ సమస్య మూలాల్ని వివరించారు. ఊరుతూ వచ్చేది నార్మల్ గ్రౌండ్ వాటరేనని వారు ప్రాథమికంగా వెల్లడించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బడేటి చంటి సారథ్యంలో త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కో – ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, కార్పొరేటర్ కత్తెర రామ్మోహన్‌రావు, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, నడపన దానభాస్కర్, సామాజిక సేవాకర్త బికెఎస్ఆర్ అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిలీ లిపితో ఉన్నత స్థాయిలో అంధులు -ఎంఈఓ నరేష్ కుమార్

**ముదినేపల్లి ,మేజర్‌న్యూస్ :** బ్రెయిలీ లిపితో చదువుకుని అంధులు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారని ఎంఈఓకే నరేష్ కుమార్ అన్నారు. ముదినేపల్లి భవిత కేంద్రంలో లూయిత బ్రెయిలీ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులు అయినప్పటికీ కృషి ,పట్టుదలతో కలెక్టర్ సహా ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మన కరెన్సీ నోట్లకు ఓవైపున దివ్యాంగులు అర్థం చేసుకునేలా ప్రత్యేక లైన్ల నిచ్చిందన్నారు. అంధులు ప్రభుత్వం,దాతల ప్రోత్సాహంతో ఇంకా విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎం వై విజయకుమార్ , భవిత కేంద్రం సిబ్బంది బి నీలిమ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పిల్లల జ్ఞానం,విజ్ఞానం పెరుగుదలకు సైన్స్ ఫెయిర్ దోహదం






వీరవాసరం,మేజర్‌న్యూస్: పిల్లల జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్,శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు అన్నారు. శనివారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్,శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు సభా అధ్యక్షులుగా హాజరై ప్రారంభించారు.ఈసందర్భంగా పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ భవిష్యత్తుకు ఉపయోగ పడుతుందన్నారు. రాష్ట్రం,దేశం అభివృద్ధి విద్య వలన సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విద్యకు పెద్దపీట వేసి అత్యధిక నిధులను కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో మౌలిక వసతులు కల్పిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లాజాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు వలన విద్యార్థులలో సైన్స్‌పట్ల అవగాహన,పరిశోధనలపట్ల ఉత్సుకత ఏర్పడు తుందన్నారు. మన జిల్లాలోని భీమవరంకు చెందిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు టెట్రాసైక్లిన్ ప్లేగు వ్యాధి శాశ్వతంగా నివారించడానికి, క్యాన్సర్ నిరోధకానికి మేథోట్రెకేసేట్, ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రపంచవ్యాప్తంగా నేటికీ వినియోగిస్తున్న హెట్రాజన్ ఔషధాన్ని, మొదలగు యాంటీబయోటిక్స్ ను కనిపెట్టడం జరిగిందని ఈసందర్భంగా గుర్తు చేశారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ సైన్స్‌విద్య విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను వెలికితీస్తుందని, దీనికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు శాసనసభ్యులు భారతమాత విగ్రహానికి పూలమాలను అలంకరించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా డాక్టర్ ఎబిజె అబ్దుల్ కలాం, సర్ సి.వి.రామన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి శాసనసభ్యులు,జిల్లా జాయింట్ కలెక్టర్, శాసనమండలి సభ్యులు, తదితరులు నివాళులర్పించారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చివరిగా సైన్స్ ఫెయిర్‌సెల్ఫీపాయింట్ వద్ద శాసన సభ్యులు, జిల్లా జాయింట్ కలెక్టర్,శాసనమండలి సభ్యులు సెల్ఫీలను తీసుకోవడం విద్యార్థుల్లో ఉత్సాహన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఎస్ ఎస్ ఏ ఏపీసి పి.శ్యామ్ సుందర్, జిల్లా సైన్స్ అధికారి వివిఎంజెడ్ శ్యామ్ ప్రసాద్, జడ్పిటిసి జి.జయ ప్రకాష్ నాయుడు, హై స్కూల్ ప్రధానఉపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, తాహసిల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, మండల ప్రెసిడెంట్ వి.దుర్గాభవాని, వీరవాసరం ఎంపీటీసీ జి.విజయలక్ష్మి, వివి లక్ష్మి, స్థానిక నాయకులు మెంటే పార్థసారథి, ఎస్.కమల, ఏ.మౌనిక, ఎంఈఓలు, విద్యాశాఖ సిబ్బంది,పాఠశాలవిద్యార్థిని,విద్యార్థులు,పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాలి

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగంచేసిన నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాలలోని కుటుంబాలకు పునరావాస పరిహార సొమ్ము ఖాతాలో జమవుతున్నట్లు పత్రికలలో వార్తలు వచ్చాయని,పరిహారం సొమ్ము చెల్లించడం హర్షదాయకమే అయినా కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగా ప్రాజెక్టు ఎత్తు 45.72మీటర్ల పరిధిలో ఉండేటట్లు పరిగణించి ముంపునకు గురయ్యే గ్రామాల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2015 తెలుగుదేశం ప్రభుత్వం గిరిజనులకు పునరావాసప్యాకేజీ రూ.6.86 లక్షలు, గిరిజనేతరులకు రూ.6.36 లక్షలు చొప్పున ప్రకటించిందన్నారు. అయితే 2019 ఎన్నికల సందర్భంగా జగన్ తాను అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షలు ఇస్తామని,2006 ముందు సేకరించిన భూములకు రూ.5 ఐదు లక్షలు చెల్లిస్తామని ప్రకటించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వాసితులకు పరిహారం వారి ఖాతాలలో ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా కాలయాపన చేసిందని విమర్శిం చారు. కేవలం నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.30 వేల కోట్ల పరిహారాన్ని ఎగ్గొట్టడానికి చేసే కుట్రలో భాగమే ప్రాజెక్టు ఎత్తును కుదించడంలో భాగం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావాస పూర్తి ప్యాకేజీ ఎప్పుడు చెల్లిస్తారో ఆ తేదీనే కట్ ఆఫ్ తేదీన నిర్ణయించాలని సిపిఐ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టపరిహారం చెల్లించాలన్నారు. వేలేరుపాడు మండలంలో ఉపాధి కోసం 5వేల మందికి పైగా భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలకు వలస వెళ్లారని,వారు స్థానికంగా లేరనే నెపంతో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ,చెల్లించడం లేదని ఆరోపించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించని పక్షంలో సిపిఐ తరపున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సరైన లక్ష్యాన్ని నిర్ణయించుకోకుండా చదవడంతో ప్రయోజనం ఉండదు




**భీమడోలు,మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన లక్ష్యాన్ని నిర్ణయించుకోకుండా చదువులు కొనసాగించడం వల్ల పెద్దగా ప్రయోజనాలు పొందలేకపోతున్నారని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదా దేవి అభిప్రాయపడ్డారు. శ్రీ వెంకటేశ్వర కళాశాలలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్ అంశాలపై సెట్వెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బొమ్మ రవికుమార్ అధ్యక్షత వహించగా,ముఖ్యఅతిథిగా యువజన సర్వీసులశాఖ కమిషనర్ పాల్గొన్నారు.ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు లక్ష్యాలను నిర్ణయించు కుని తద అనుగుణంగా విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. ˊమలో నిబిడీ కృతమైన నైపుణ్యాలకు అనుగుణంగా తమకు నచ్చిన విద్యను నేర్చుకోవడం ద్వారా ఆశించిన ఫలితాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సిఇఓ.ప్రభాకర్, మేనేజర్ సత్యనారాయణ, పర్యవేక్షకులు జాన్ కెనడీతో పాటు కళాశాలకు చెందిన భవాని సింగ్, ఎన్సిసి కెప్టెన్ కె.శివ శంకర్ పాల్గొన్నారు.

# అన్నార్తుల కడుపు నింపిన మహనీయురాలు డొక్కా సీతమ్మ





## – శాసనసభ్యులు చిర్రి బాలరాజు

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** ఆకలి అన్నవారికి కడుపునిండా భోజనం పెట్టే మహనీయురాలు డొక్కా సీతమ్మ జీవిత విశేషాలను నేటితరం యువకులు తెలుసుకుని పదిమందికి సహాయపడేలా ముందుకు సాగాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సూచించారు. శనివారం జీలుగుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పుట్టింది అని అన్నారు. డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను పరిశీలిస్తే మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఎంతోమందికి ఆకలి తీర్చిన మహోన్నత వ్యక్తి తమ కు ఉన్నదానిలోనే పదిమందికి పంచే గుణం కలిగిన మాతృమూర్తి అని కొనియాడారు. వారు చేసిన సేవలను స్మరిస్తూ, ఇటువంటి గొప్ప మహనీయురాలి పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు.ఇటువంటి గొప్ప ఆలోచనలను ప్రతిపాదన చేసినటువంటి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి,పథకం అమలు చేసిన చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిర్రి జగదాంబ, జూనియర్ కళాశాల యాజమాన్యం, ఎంఈఓ శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్,టీడీపీ నాయకులు యాండ్ర రాజేంద్ర, గద్దె సుబ్రహ్మణ్యం కూటమి నాయకులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంగన్ వాడిలలో ప్రాథమిక విద్య కార్యక్రమం పట్ల ఆసక్తి



భీమడోలు,మేజర్‌న్యూస్: అంగన్ వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం కేంద్రాలకు వచ్చే పిల్లలకు వివిధ అంశాల పట్ల ఆసక్తిని కలిపిస్తుందని, అవగాహన పెంచుతుందని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి తెలిపారు. గుండుగొలను లోని కోడ్ నెంబర్ 23 అంగన్వాడి కేంద్రం కార్యకర్త బి రాజామణి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ గుండుగొలను సెక్టార్ పర్యవేక్షకులు కవితతో పాటు, అంగన్వాడీ కార్యకర్త రాజమణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెల ఐదవ తేదీన కేంద్రాలకు వచ్చే మూడు నుండి ఆరు సంవత్సరాల వయస్సులైన పిల్లల తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వాని స్తామన్నారు. పిల్లలకు లెక్కలు తెలియడంతో పాటు,తమ కోసం ప్రత్యేకించిన స్టాల్‌లలో ఉంచిన కూరగాయల రంగు రుచి వాసన తెలియజేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు తెలిపామన్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూరగాయల స్టాల్‌ను పరిశీలించి విక్రతలగా వ్యవహరిస్తున్న పిల్లలనుంచి వారు నేర్చుకున్న లెక్కలు ఇతర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మురళి వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు అటలు,పాటలు నేర్పాలి





## – అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు పడమరవీధి గంగానమ్మ మునిసిపల్ హై స్కూల్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ ను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలతో ఇంగ్లీష్ లో పలు ప్రశ్నలు వేశారు. వాటికి ఆ చిన్న పిల్లలు చెప్పిన సమాధానాలకు కలెక్టర్ ముగ్ధులయ్యారు.పిల్లలకు చక్కని శిక్షణ అందిస్తున్న అంగన్వాడీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు, పిల్లలకు ప్రీ ప్రైమరీ స్కూల్ ఆక్టివిటీస్ కూడా పూర్తిగా నేర్పాలన్నారు. పిల్లలకు ఆటలు, పాటలు, మాటలు, చిన్న చిన్న పదాలు నేర్పడంతోపాటు పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించే విధంగా వివిధ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. విద్య పట్ల పిల్లలకు చిన్నతనం నుండే ఆసక్తి కలిగే రీతిలో అంగన్వాడీ సిబ్బంది పనిచేయాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు తప్పనిసరిగా నిర్దేశించిన సమయాలను పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్,ఐసిడిఎస్ పీడీ శారద,సిడిపిఓ ఏ.పద్మావతి, అంగన్వాడీ టీచర్ పద్మ,తహసీల్దార్ శేషగిరిరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# 6న జరిగే మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి



**భీమవరం,మేజర్ న్యూస్:** ఈ నెల 6న ఉండి నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రానున్న రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నా లజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ,మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ తేదీన గన్నవరం విమానాశ్రయం నుండి ఉదయం 8:40 గం.లకు రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10:30 గం.లకు ఉండి జడ్పీ హైస్కూల్ కు చేరుకుంటారు. అధునాకరించిన108 సంవత్సరాల హై స్కూల్ భవనాన్ని, క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తారు. అనంతరం ఉ.11 గం.లకు ఉండి హై స్కూల్ నుంచి బయలుదేరి పెద్ద అమిరం భీమవరం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ప్రారంభించి, అనంతరం రతన్ టాటా మార్గ్ గా నామకరణ చేసిన భీమవరం ఉండి లింక్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఉ.11.30 గంటలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఓపెన్ ఆడిటోరియం లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. అక్కడే ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో పాల్గొని,అనంతరం ఏఐసిటిఇ ఐడియా ల్యాబ్ ను సందర్శిస్తారు. మ.12.30 గంటలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి బయలుదేరి శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు గృహానికి చేరుకుని, విందును స్వీకరిస్తారు. మ.1.30 గంటలకు ఉప సభాపతి గృహం నుండి బయలుదేరి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ గృహానికి మ.1.50 గంటలకు చేరుకుంటారు. తిరిగి మ.2 గంటలకు భీమవరం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి విజయవాడ వెళ్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : 'వీరమల్లు '





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకో వాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ఈ పథకాన్ని ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాన్ని సక్రమంగా నిర్వహించేలా సిబ్బంది చూడాలన్నారు. ప్రతి విద్యార్థి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ , తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు చలసాని జగన్మోహన్రావు , సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు , జనసేన మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు , బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి , నీటి సంఘం అధ్యక్షులు పోసిన పాండురంగారావు , హనుమార పేర్నీడు , నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు దావు నాగరాజు , ఎన్డిఏ నాయకులు బొంగు రవికుమార్ , యర్రా రాంబాబు , బత్తుల రవి , కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి





### – ప్రజా దర్బార్ ద్వారా 223 అర్జీలు స్వీకరణ

**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో శనివారం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పొన్నం కళ్యాణమండపంలో ప్రజా దర్బారు నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి ఆయా సమస్యలు పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు తమకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో పేదలకు స్థలాలు మంజూరు చేశారని ,వాటిల్లో కొంతమంది ఇళ్ళు నిర్మించుకున్నారని, కొంతమంది ఇల్లు ప్రారంభదశలో ఉండగా,గత ప్రభుత్వం ఇళ్లకు బిల్లులు చెల్లించలేదని, ప్రారంభ దశలో ఇళ్ల ఉన్నవాటిని కూడా నిర్మాణ పనులు పూర్తి చేయనివ్వలే దన్నారు. తమ సమస్యను పరిష్కరించ వలసిందిగా కోరారు. గ్రామంలోని మహిళలు, తాము ఎన్ఆర్ జిఎస్ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నామని వారానికి కనీసం కూలి రావడం లేదని అడగగా,వెంటనే కూలి డబ్బులు రిలీజ్ చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి,గత కొద్ది రోజులుగా కూలి డబ్బులు చెల్లించలేదని మంత్రి దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్, ఎ,పి, ఓ, లను పూర్తి వివరాలు క్షున్నంగా పరిశీలించి, కూలీలకు తక్షణమే డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. గ్రామంలో కొంతమంది పింఛన్లు, ఇళ్ళ స్థలాలకోసం,వితంతు ఫించన్లు కోసం, పలు అర్జీలు రాగా తక్షణ పరిస్కారం కోసం అర్హతవున్న ప్రతి ఒక్కరికి పరిష్కారం చూపించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే ఎన్ వి ప్రసాద్, డివిజినల్ పంచాయతీ అధికారి సుందరి, ఎంపిడిఓ బి భార్గవి, నూజివీడు నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాసరావు నక్కన బోయిన వేణు, దొండపాటి ఏసుపాదం, జలసూత్రం వంశీకృష్ణ, బెక్కం రాజగోపాల్, కూరాకుల ఊర్మిళ, చౌటపల్లి లక్ష్మీ విక్టర్ బాబు, మడుపులు గోపాల్,బెక్కం వెంకట శ్రీనివాసరావు, నూతలపాటి నాగభూషణం, పామర్తి నరసింహారావు తదితర కూటమి నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంధ న్యాయ సేవ కార్యకర్తలకు శిక్షణ

నరసాపురం,మేజర్‌న్యూస్ : స్వచ్ఛంద న్యాయ సేవా కార్యకర్తలకు శిక్షణ తరగతులునిర్వహించారు. 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి శ విజయ దుర్గ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శనివారంస్థానిక కోర్టుల ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి పి. విజయ దుర్గ పారా లీగల్ వాలంటీర్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాలలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి పారా లీగల్ వాలంటీర్లు పాత్ర ఎక్కువగా ఉంటుందని శిక్షణ పొందిన ప్రతి పియల్‌వి సమాజం పట్ల నైతిక భాధ్యత కలిగి ఉండాలన్నారు.మారు మూల ప్రాంతాల వారికి లోక్ అదాలత్, ఉచిత న్యాయం గురించి తెలపాలన్నారు. న్యాయ సేవలని ప్రజలకు ఉచితంగా అందించడమే న్యాయ సేవా కార్యకర్తల భాధ్యతఅని శిక్షణలో భాగంగా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు, హిందూ,ముస్లిం క్రిస్టియన్ వివాహాల చట్టాలు ,వివాహం అయిన వెంటనే




తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గురించి, అధనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, ప్రథమ సమాచార రిపోర్ట్,అరెస్ట్, బెయిలు, జైల్ ముద్దాయిల హక్కులు,గృహహింస చట్టం, వరకట్న వేధింపుల చట్టం తదితర చట్టాలపై శిక్షణ కల్పించారు. అనంతరం గుర్తింపు కార్డులను ఇచ్చారు.ఈగుర్తింపు కార్డులను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలని న్యాయమూర్తి అన్నారు.

# సిపిఐ కార్యాలయం కూల్చడం హేయమైన చర్య

### – 9న బుట్టాయిగూడెం ఘటనకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా

**ఏలూరు,మేజర్‌న్యూస్:** బుట్టాయిగూడెం మండలంలో సిపిఐ కార్యాలయం కూల్చడం హేయమైన చర్య అని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి.శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు బుట్టాయిగూడెంమండల కార్యాలయం కూల్చివేతను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండల కార్యాలయాన్ని దురాలోచనతో కొందరు విద్రోహశక్తుల అండతో స్థానిక తాసిల్దార్ కూల్చి వేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల నుండి నిర్మాణం జరుగుతున్నా తాసిల్దార్ కనీసం ఎటువంటి సమాచారం లేకుండా కుట్రపూరితంగా కూల్చివేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. సిపిఎం నాయకులు కేశ్రీనివాస్‌మాట్లాడుతూ బుట్టాయి గూడెం కార్యాలయం కూల్చివేత ఘటన బాధాకరం అన్నారు. అధ్యక్షత వహించిన సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిపిఐ బుట్టాయిగూడెం కార్యాలయం గత 40 సంవత్సరాల నుండి కార్యకలాపాలు సాగిస్తుందని,భద్రాచలం పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కార్యకలాపాలు అక్కడ నుండే నిర్వహించామని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) జిల్లా అధికార ప్రతినిధి బద్దా వెంకట్రావు ,ఎంసిపిఐ



నాయకులు నాగరాజు ప్రసంగించారు. ఈనెల 9న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించాలని, అంతకంటే ముందు జంగారెడ్డిగూడెం రెవిన్యూ కార్యాలయం,బుట్టాయి గూడెం తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బి.కె.యం.యు. ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మాట్లాడారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు,గొర్లి స్వాతి,నాగం అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సిబ్బందికి పనిముట్లు అందజేయాలి : కమిషనర్ అంజయ్య



నరసాపురం,మేజర్ న్యూస్ : మున్సిపల్ పరిధిలో వివిధ వార్డుల లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, ఆరోగ్య పరిరక్షణకు అవవసరమైన వస్తువులను సకాలంలో అందజే యాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు ఇస్తున్న పనిముట్లను (చీపుర్లు, హాండ్ గల్వ్స్, బాలే, పార, పాదరక్షలు, కొడవలి, మాస్క, పూడికతీత కు అవసరమయే రేకులు.ఫాగింగ్ మిషన్ మరికొన్ని పనిముట్లు నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం కొని ప్రదేశాలలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ఈకార్యక్రమంలో సానిటరి ఇంస్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు,నవ్య,కిషోర్,నరేష్ సచివాలయ సిబంది పాల్గొన్నారు.

## కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** మునిసిపల్ కార్యాలయములో లైటి ంగ్ మెటీరియల్, డ్రైవర్లు, పి.సి.బిలు, రికార్డులను చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ శనివారంతనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వస్తువు ఎక్కడ ఉపయోగించారో రికార్డ్ చేయాలని, పట్టణంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజా ప్రతినిధులకు తెలియజేయవలసి ఉన్నందున రికార్డులు పారదర్శకంగా ఉంచాలన్నారు.ఈ కార్యక్రమములో కమీషనర్ యం అంజయ్య డి.ఈ,ఏ ఈ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్ట్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను అమలు చేయాలి

### – డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు విన్నపం



**కైకలూరు, మేజర్ న్యూస్,** జీవో ఎంఎస్ నెంబర్ 120 ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ డిబేట్ డేట్ 1999 అక్టోబర్ 4న సుప్రీం కోర్టు ఉత్తర్వులను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తరవులను అమలు చేయాలని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌కి సామాజిక కార్యకర్త జంపన శ్రీనివాస్ గౌడ్ విన్నవించుకున్నారు. కొల్లేరు సరస్సు వన్యప్రాణి అభయా రణ్యం ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, కైకలూరు, మండవల్లి తదితర మండలాల్లోని 30,855 హెక్టార్లో విస్తరించి ఉంది. కొల్లేరు సరస్సులో బుడమేరు మేజర్ డ్రైవ్‌తో పాటు తమ్మిలేరు, రామిలేరు, వంటి 67 గుర్తింపు పొందిన ట్రైన్లు గుర్తింపు పొందని 46 డ్రైన్‌లోని డ్రైనేజీ నీరు కలుస్తుంది. సుప్రీం కోర్టు ఉత్తర్వులు మేరకు ఆపరేషన్ కొల్లేరు పేరుతో 2006 వ సంవత్సరంలో 17 76 చేపల చెరువుల చెరువులను తొలగించి నప్పటికీ తరువాత1776 చెరువులతోపాటు వేలాది ఎకరాల్లో అనాధికారిక చెరువులతో కొల్లేరు సరస్సు నిండిపోయి బుడమేరు డ్రైన్ లోని నీరు కొల్లేరు సరస్సుకి వెళ్లిన కారణంగా సెప్టెంబర్ 2024 లో కురిసిన వర్షాలకు విజయవాడ నగరం నీట మునిగి 6 లక్షలమంది నిరాశేలైనారు.

కొల్లేరు సరస్సులో వేలాది ఎకరాల అణాధికారిక చెరువులను తొలగించడానికి ఆక్రమణలకు కారుకులైన అటవీ శాఖ అధికారులపై తగిన క్రిమినల్ చర్యలు సుప్రీం కోర్ట్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్‌కి విజ్ఞప్తి చేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఏలూరులో మూడు కొత్త బస్సులు ప్రారంభం



ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు కొత్త బస్టాండ్‌లో మూడు నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి, విజయవాడ బోర్డు జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కో ఆప్షన్ సభ్యులు ఎస్.ఎమ్.ఆర్. పెదబాబు ముందుగా ఏలూరు కొత్త బస్టాండ్ డిపోకి వచ్చిన రెడ్డి అప్పలనాయుడు మరియు ఎమ్మెల్యే బడేటి చంటికి ఆర్టీసీ సిబ్బందులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.. అనంతరం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్సెమ్మార్ పెదబాబు తో కలిసి రెడ్డి అప్పలనాయుడు మూడు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించారు. ఏలూరు నుండి హైదరాబాద్ (బిహెచ్ఈఎల్) కు వయా ఖమ్మం మీదుగా రెండు సర్వీసులు, 1 బస్సు వయా విజయవాడ మీదుగా హైదరాబాద్ (బిహెచ్ఈఎల్)కు నడుపబడుతాయని వారు పేర్కొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు, ఆర్టీసీ అధికారులకు నూతన సంవత్సర,సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.

వైసీపీ నాయకులకు ఎప్పుడూ దోచుకోవడానికే తప్ప తనను గెలిపించిన ప్రజలకు రక్షణగా ఉండాలని, వాళ్ళు పడుతున్న ఇబ్బందులు, సమస్యలు తీర్చలేకపోయారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఎటు చూసినా గుంతల రోడ్లు దర్శనమిచ్చేవని, బస్సు ప్రయాణం చేయాలంటేనే ప్రజలు నరకయాతన పడేవారన్నారు. రోడ్లు సక్రమంగా లేక గుంతలు పడి అనేక రకాలుగా ఆర్టీసీ ఆదాయాన్ని కోల్పోయిందని, వైసీపీ, జగన్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ వాణీ,అసిస్టెంట్ మేనేజర్ మురళీ, ఎమ్.ఎఫ్.ప్రేమ్ కుమార్, పలువురు ఆర్టీసీ అధికారులు, సిబ్బందులు,జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా,వివిధ హోదాల్లో ఉన్న జనసేన టిడిపి బిజెపి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# పౌష్టికాహారంతో అభివృద్ధి సాధించాలి



కైకలూరు,మేజర్ న్యూస్, నేటి నుండి కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మరియు కమ్మిలి విఠల్ రావు (మాజీ ఎమ్మెల్సీ) కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించారు, దారిద్ర రేఖకు దిగువనున్న పేదరికంలో విద్యార్థులకు ఈ పథకంవర్తిస్తుందని ఆర్థికపరమైన ఇబ్బందులు కారణంగా ఉన్నత విద్య కు దూరం కాకుండా చూడటంలో భాగంగా మధ్యాహ్నం భోజన పథకం సర్కార్ అమల్లోకి తీసుకువచ్చింది. ఈ భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందడంతో పాటు ఆరోగ్యపరంగా అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జయ మంగళ వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి పరుస్తూ విద్యార్థులు బాగా చదువుకొని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కైకలూరు గ్రామ సర్పంచ్ మేరీ నవరత్నకుమారి, టిడిపి నాయకులు తేరా రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి వైసిపి కార్యకర్త తన కుటుంబ సభ్యుడే : 'వడ్డీ'



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : ప్రతి వైసీపీ కార్యకర్త తన కుటుంబ సభ్యుడేనని వారికి ఎటువంటి కష్టం వచ్చినా ఆ కుటుంబంతో భాగస్వామ్యం అవుతారని వైఎస్ఆర్సిపి రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్ద గ్రామానికి చెందిన జలపతి అచ్చయ్య ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని వైసీపీ నాయకులు శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి వడ్డీ రఘురాం నాయుడు 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ శేషులత, నాయకులు దారపురెడ్డి శ్రీనివాస్, యాతం చంద్రయ్య, జాలపర్తి కిట్టయ్య, కొండబోయిన కృపవరం తదితరులు ఉన్నారు.

# విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనలు సృజనాత్మకతను వెలికితీస్తాయి





– జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

దెందులూరు, మేజర్ న్యూస్: ఏలూరు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలపట్ల విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు పద్మశ్రీ సూచించారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీస్తాయన్నారు. రేపటి పౌరుల్ని ప్రతిభ కల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక అంశాలలో ఉత్తమమైన 81 ప్రదర్శనలను జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. వీటిలో ఉత్తమమైన వాటిని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించేలా విద్యార్థులలో ప్రేరణ కలిగించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, తహసీల్దార్ సుమతి, ఎంపిడిఓ శ్రీదేవి, డిప్యూటీ డీఈఓ రామన్నదొర, జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓ లు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్.ఎల్. ఎన్ .వి.జి. శర్మ, సర్పంచ్ మధులత, ఉప సర్పంచ్ జి. కొండలరావు, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ గణేష్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం సోషల్ మీడియా జిల్లా కన్వనర్‌గా అంగర



పాలకొల్లు, మేజర్ న్యూస్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు పట్టణ సమావేశం పట్టణ అధ్యక్షులు ముక్కా సత్యనారాయణ ఏర్పాటు చేశారు, ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వర్కింగ్ కమిటీ ముద్దాడ గణేష్ భవాని అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు... జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్. నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యలరావు పొల్గున్నారు...ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ భారత దేశంలో జరగబోవు జనాభా లెక్కలను కులాల వారిగా చేయాలి అని దేశ జనాభాలో 60 శాతం కి పైబడి ఉన్న బడుగు బలహీనవర్గాలకు చెందిన కుల గణన చేయాలి అని. దేశ సంపదలో బలహీన వర్గాల వాటా ఎంతఐతే ఉందో. రాజకీయ వాటా కూడ అంతే ఉండాలి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ ప్రసంగించారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అంగర దేవ కుమార్ మాట్లాడుతూ నాకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సుబ్బారావు,నిలం శెట్టి సత్యప్రసాద్ ,వివిధ బీసీ కులాల నాయకులు.

## పాలమూరులో ఎమ్మెల్యే పితాని పరామర్శ



పెనుమంట్ర,మేజర్‌న్యూస్ : తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఆళ్ల జానకిరామయ్య సతీమణి మృతి చెందడంతో కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరామర్శించారు. శనివారం పొలమూరులో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి సీనియర్ నాయకుడు చిట్టూరి సత్యనారాయణ సతీమణి మరణించడంతో సత్య నారాయణ పరామర్శించారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు వివేక రాఘవేంద్ర రాజు, చింతపల్లి రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరరావు, కండిబోయిన శ్రీనివాసరావు, జనసేన టిడిపి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యా విధానంలో వినూత్న మార్పులకు లోకేష్ కృషి

– డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన జనసేన నేత సాయి



బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్: విద్యావిధానంలో వినూత్న మార్పులకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరాటం సాయి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటం సాయి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా అభివృద్దే ధ్యేయంగా మంత్రి నారా లోకేష్ పని చేస్తున్నారని తెలియజేశారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఎదిగే వయ సులో పిల్లలకు పోషక ఆహారంఅందించేందుకు కూటమిప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలియజేశారు. నాణ్యమైన ఆహార పదార్థాల మెనూ అమలుతో విద్యార్థినీ విద్యార్థులకు పోషక ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకుప్రయోజనకరం ఉంటుందన్నారు.ఈకార్యక్ర మంలో ఎంఈఓ తెల్లంబాబురావు,జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఇరప గంగాదేవి తదితరులు ఉన్నారు.

# 10లో సి,డి గ్రేడుల విద్యార్థులకు విజయకేతనం ఉపయోగం

**– జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్**



**భీమడోలు,మేజర్‌న్యూస్:** ప్రస్తుత విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుతూ సి,డిగ్రేడుల్లో గల విద్యార్థులు,తమగ్రేడులను పెంపొందించు కునేందుకు, జిల్లా పరిషత్ యాజమాన్యం పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న విజయకేతనం పుస్తకాలు సహకరిస్తాయని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిషత్ నిధులతో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన విజయకేతనం పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గుండుగొలను హైస్కూల్లో శనివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులు ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. గత విద్యా సంవత్సరం శనివారం పేట ఉన్నత పాఠశాల అత్యధిక శాతంఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకొందన్నారు.ప్రస్తుత విద్యా సంవత్సరం అంతకు మించిన ఉత్తీర్ణతా శాతం గుండుగొలను హై స్కూల్ సాధించి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు.

సదరు విజయకేతనం పుస్తకాలను నిష్ణాతులైన ఉపాధ్యాయులు రెండు నెలల పాటు నిరంతరంగా శ్రమించి వాటిని తయారు చేశారన్నారు. వీటి తయారీకి సరాసరిన ఒక్కొక్క పుస్తకానికి రూ. 600 వరకు ఖర్చుకాగా,జిల్లా పరిషత్ 40లక్షల రూపాయలు ప్రత్యేకించిందని తెలియజేశారు. కార్యక్రమంలో భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి,పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌చింతల వెంకటేశ్వర రావు, అధికారపక్ష కూటమి నాయకులు సిరిబత్తిన కొండబాబుతో పాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులు-యాజమాన్య కమిటీ మధ్య వాగ్వావాదం** – కాగా సమాచారం అందజేయటం ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ మధ్యవాగ్వివాదం.గుండుగొలను హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలపంపిణీపై ముందస్తు సమాచారం అందజేయలేదని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చింతల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి. సిరి బత్తిన కొండబాబు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కు ఫిర్యాదు చేశారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉందని సమావేశం ప్రారంభం కావటానికి కాస్త ముందుగా మాత్రమే తెలియజేశారని, ఇదేవిధంగా పాఠశాలలో జరిగే ప్రతీకార్యక్రమం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇదేతరహాలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రోటోకాల్ కు తిలోదకాలు పలికారని చైర్ పర్సన్ దృష్టికి తెచ్చారు.సమావేశం పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణానికి సిద్ధమైన జిల్లా పరిషత్ చైర్పర్సన్ దంపతులు సమక్షంలోనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, తెలుగుదేశం నాయకులు తీవ్ర పదజాలంతో వాగ్వావాదానికి దిగటం ఒకింత ఇబ్బందికరంగా తయారైంది.

# సావిత్రిబాయి పూలే సేవలు ఆదర్శం

**: ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న**



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే దేశానికే ఆదర్శమని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సీతారంపురంలో, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో, మందుల కులస్తుల పోరాట సమితి ఆధ్వర్యంలో, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. ఈ సందర్భంగా వీరన్నమాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో ఉన్నటువంటి కుల వ్యవస్థ పట్టిపీడిస్తున్న రుగ్మతలను రూపుమాపటం కోసం అనేక పోరాటాలు చేశారని, మహాత్మ జ్యోతిరావు పూలే అతి చిన్న వయసులో ఉన్న సావిత్రిబాయి పూలే ని వివాహం చేసుకున్నారని అన్నారు.సావిత్రిబాయి పూలే భారతదేశంలో స్త్రీ విద్యా విప్లవాన్ని ప్రారంభించిన సాంస్కృతిక యోధురాలు అని, ఆమె మహోజ్వలమైన చరిత్ర భారతదేశంలో స్త్రీల సాధికారతకు బాటలు వేశారని ఆయన అన్నారు. ఈనాటి స్త్రీలు విజ్ఞులు సామాజిక సంస్కృతిక సాంకేతిక రంగాల్లో అద్భుత పాత్ర వహించటానికి పునాది వేసింది సావిత్రిబాయి పూలే అని ఆయన అన్నారు.ఆమె బాటలో ప్రతి ఒక్కరు నడవాలని వీరన్న అన్నారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి పెద్దిరాజు,పెంద్ర పెద్ద ఏసు, పెంద్ర ప్రసాద్,సత్తిబాబు, చిన్న ఏసు,వాడపల్లి రాజు, పెంద్ర శ్రీను, సాయి, వాడపల్లి రాకేలు గతదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులను దగా చేసిన గత ప్రభుత్వం

- **ఒకే రోజు 832 కోట్లు పరిహారం చెల్లించిన ఘనత చంద్రబాబుది**
- **రూ.6.85 కోట్లతో ఆరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు**



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారంగా రూపాయి కూడా చెల్లించకుండా దగా మోసం చేశారని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు నియోజకవర్గంలో రూ 6.85 కోట్లతో ఆరు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే ఒకే రోజు నిర్వాసితులకు పరిహారంగా 832 కోట్లు చెల్లించిన ఘనత చంద్రబాబుది అన్నారు. అది కూడా ఎటువంటి అవినీతి, దళారీ వ్యవస్థ కు కావు లేకుండా పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్కరికి రూ 10 లక్షలు నుంచి 40 లక్షల వరకు బ్యాంకుల్లో జమ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆనాడు 2017 లో ఎనిమిది వందల కోట్లు పరిహారం గాను నేడు 832 కోట్లు ఇచ్చింది చంద్రబాబుయే నని మధ్యలో వచ్చిన గత ప్రభుత్వం ముంచేసారని ఐదు రూపాయలు కూడా సాయం అందించలేదని నిర్వాసితులే చెబుతున్నారన్నారు. నేడు ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే 2014 –19 లో 72 శాతం చంద్రబాబు పూర్తి చేశారన్నారు. పాలకొల్లు మండలం తిల్లపూడి, శివదేవుని చిక్కాల, పొలమూరు, గవరపేట, బల్లిపాడు, దగ్గులూరు గ్రామాల్లో రూ 6.85 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు,శిలాఫలకాలాలను మంత్రి ఆవిష్కరించారు. ఆరు గ్రామాల కార్యక్రమాలకు మంత్రి రామానాయుడు స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ ప్రజలను పలకరించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్,జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగు అధికారి కె. యస్. యస్. యస్. శ్రీనివాస రావు, గృహ నిర్మాణ శాఖ ఇఇ యం.శ్రీనివాస రావు, తహశీల్దారు వై.దుర్గా కిషోర్, యంపిడివో యన్.ఉమా మహేశ్వర రావు, డిఇలు కలవకోలను దుర్గా రామస్వామి, బి. వి. రమణ, పి.శ్రీనివాస రావు, రామాయణం త్రిమూర్తులు, ఈవోపీఆర్డీ టి.మూర్తి బాబు, యంపిపి చిట్టూరి కనక లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజులు నాయుడు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రపంచానికే ఆదర్శనీయం

**– రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు**



**పాలకొల్లు మేజర్ న్యూస్:** డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రపంచానికే ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ లో జరిగిన లూయిస్ బ్రెయిలీ 216 వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి మంత్రి రామానాయుడు,జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి,ఆర్డీవో దాసిరాజులు సంయుక్తంగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో లూయిస్ బ్రెయిలీ 216 వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకునుట నాకు వ్యక్తిగతంగా చాలా ఆనందాన్ని కలిగించిందని అన్నారు. దివ్యాంగులకు గత ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని,మన ప్రజా ప్రభుత్వంలో రూ 3 వేలు నుండి రూ 6 వేలు రూపాయలు పెన్షన్లు పెంచి ప్రతి నెల ఒకటవ తేదీన ప్రతి గడపకు వెళ్ళి అందజేస్తున్నామని అన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ మానవజాతి పుట్టిన పుడు నుండి పదిమంది ముఖ్యలలో బ్రెయిలీ ఒకరని అన్నారు. దివ్యాంగుల పట్ల సానుభూతి చూపటం కాదని ప్రేమ, ఆప్యాయతలు పంచాలని అన్నారు. బ్రెయిలీ నిరుపేద కుటుంబంలో పుట్టారని, అయిదు సంవత్సరాల వయసులో యాక్సిడెంటువల్ల రెండుకళ్ళుపోయాయని అన్నారు. పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించవచ్చునని సాధించి చూపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ జి.కోటేశ్వరరావు, ఆర్డీవో దాసిరాజు, సర్వశిక్ష అభియాన్ ఏపీవో పి.శ్యామ్ సుందర్, తహశీల్దారు వై.దుర్గాకిషోర్,రాష్ట్రదివ్యాంగుల అధ్యక్షులు జి.రవీంద్రబాబు, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు బి.రమణారావు, నాయకులు గండేటి వెంకటేశ్వర రావు, బోణం చినబాబు, బిరుదుకోట సోమ శేఖర్, పొట్నూరి శ్రీనివాసరావు,చినమిల్లి గణపతిరావు,పీతల శ్రీనివాసు, టిడిపి, బిజెపి, జనసేన, నాయకులు, దివ్యాంగులు, అంధులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం సేకరణ వేగవంతంగా జరగాలి

**: జెసి రాహుల్ కుమార్**



భీమవరం,మేజర్ న్యూస్: శనివారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలోని ఉన్న 14 గిడ్డంగులు యజమానులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో మరఆడిన బియ్యాన్ని త్వరితగతిన దిగుమతి అయ్యేలా తగిన హమాలీలను సమకూర్చుకొని బియ్యం దిగుమతి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. గిడ్డంగుల నిర్వహణలో ఏటువంటి అవకతవకలు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇతర జిల్లాలకు పంపవలసిన బియ్యాన్ని సకాలంలో సక్రమంగా సరఫరా చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గిడ్డంగులన్నీ రాష్ట్ర ఎస్ డబ్ల్యు ఎస్ సి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఎం సివిల్ సప్లై అధికారి టి.శివరామ ప్రసాద్, రీజనల్ మేనేజర్ జి.భాను మూర్తి, గిడ్డంగుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.